క్లుప్తంగా

ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి


ముస్లిం సంఘం నాయకులతో ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి చేసానని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. రాంపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పెందుర్తి ముస్లిం సంఘం ప్రతినిధులు శుక్రవారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. నల్లక్వారీ సమీపంలో నిర్మించ తలపెట్టిన మసీదు శంకుస్థాపనకు హాజరు కావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. పలు అంశాలపై వారితో ఎమ్మెల్యే చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కిల్లి అప్పారావు, నరవ బంగారునాయుడు, ముస్లిం సంఘం ప్రతినిధులు సాహుల్, షేక్ షఫీ ఉల్లా, షేక్ గంగాధర్, షేక్ దర్గా, షేక్ రమ్మాన్, షేక్ రహీ తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా పునర్వసు నక్షత్ర హోమం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై ఉన్న పురాతన రామాలయంలో శుక్రవారం హోమం విశేషంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని హోమగుండం వద్ద విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను అర్చకుడు రాఘవ తదితరులు నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం అందజేశారు.

ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్ల అందజేత


గ్యాస్ స్టవ్‌లు అందజేస్తున్న రామునాయుడు

సింహాచలం: ప్రధాన మంత్రి ఉజ్వల్ గ్యాస్ (ఉచిత కనెక్షన్) పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు శుక్రవారం బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు అందజేశారు. 93వ వార్డు పరిధి శ్రీనివాసనగర్‌లోని భారత్ గ్యాస్ ఏజెన్సీలో జరిగిన కార్యక్రమంలో రామునాయుడు మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఉజ్వల్ గ్యాస్ ఉచిత కనెక్షన్‌కి సంబంధించి అర్హులైన వారిని గుర్తించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పెందుర్తి మండల అధ్యక్షుడు కాళ్ల జగన్ మోహన్, మండల ప్రచారక్ ప్రసాద్, భారత్ గ్యాస్ ఏజెన్సీ ప్రొప్రైటర్ సూర్య పాల్గొన్నారు.

మహిళా చట్టాలు సక్రమంగా అమలు చేయాలి

పెందుర్తి: మహిళా చట్టాలను అమలు చేయడంలో కేంద్రం ప్రభుత్వం విఫలమైందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పద్మ ఆరోపించారు. మహిళా చట్టాలను సక్రమంగా అమలు చేయాలని కోరుతూ శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పి బీజేపీ ప్రభుత్వం మహిళలను దారుణంగా మోసం చేస్తుందన్నారు. ఐద్వా నాయకురాలు బి.రమణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


రాము(ఫైల్)

పరవాడ: పరవాడ–గాజువాక రహదారిలో గురువారం రాత్రి జాజులవానిపాలెం వద్ద బస్సును ద్విచక్ర వాహనం ఢీ కొన్న సంఘటనలో చింతల గొర్లివానిపాలేనికి చెందిన సీహెచ్.రాము(23) మృతి చెందాడు.ఎస్ఐ సిరపరపు సురేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో చింతల గొర్లివానిపాలేనికి చెంది రాము ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్న క్రమంలో జాజులవానిపాలెం వద్ద ఎదురుగా వస్తున్న ప్రైవేటు బస్సును ద్విచక్ర వాహనంతో బలంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో రాము తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నగరంలో కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాని ఎస్ఐ సురేష్ చెప్పారు.

జూనియర్ కళాశాలకు మహర్దశ

నాడు

పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల. ఈ పేరు వింటే ఘన చరిత్ర కళ్లముందు కదలాడుతుంది. ఎందరో ఉద్దండ నేతలు, వ్యాపారవేత్తలు, క్రీడాకారులను అందించిన సరస్వతీ నిలయం. అంతటి కీర్తి ఉన్న కళాశాల దశాబ్దాల కాలంగా శిథిలావస్థలోనే ఉండిపోయింది. తరగతి గదులు లేక..ఉన్నా కూర్చోవడానికి వీల్లేక..మరుగు కష్టాలు.. తాగునీటికి విద్యార్థులు అవస్థలు పడేవారు. అయినా గత ప్రభుత్వం కళాశాల అభివృద్ధిని పట్టించుకోలేదు. కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇక్కడ చేరేందుకు విముఖత చూపించే పరిస్థితి.

నేడు

కళ తప్పిన కళాశాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవం పోసింది. కళాశాల దుస్థితిని పరిగణలోకి తీసుకుని నాడు-నేడు ఫేజ్-2లో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ.1.79 కోట్లు విడుదల చేసింది. కళాశాలలో ప్రాథమిక సదుపాయాల కల్పనకు ఆయా నిధులు కేటాయించింది. ప్రస్తుతం ఆయా పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే పలు వసతులు సమకూరడంతో విద్యార్థులు హాయిగా చదువుకుంటున్నారు. పనులు పూర్తయితే పూర్వ వైభవం వస్తుందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- రూ.1.79 కోట్లు మంజూరు
- కళాశాలలో చురుగ్గా సాగుతున్న పనులు
- విద్యార్థుల హర్షాతిరేకాలు




నాడు: ఆరు బయట శిథిలాల్లో చదువుకుంటున్న విద్యార్థులు


నేడు: తరగతి గదిలో బెంచీలపై విద్యార్థులు


పెందుర్తి జూనియర్ కళాశాల

పెందుర్తి: టీడీపీ ప్రభుత్వ హయాంలో కళాశాలను అభివృద్ధి చేస్తామని ప్రకటనలు చేయడం తప్పా ఆచరణలో చూపలేదు. ఎన్నోసార్లు కళాశాలలో కార్యక్రమాలకు హాజరైన నాటి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఇక్కడి పరిస్థితిని నేరుగా చూసినా కళాశాలలో సౌకర్యాల కల్పనకు ఆసక్తి చూపలేదు. అనేకసార్లు విద్యార్థులు, అధ్యాపకులు టీడీపీ ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించాలని విన్నవించినా ఫలితం లేదు. అప్పట్లో కనీసం తాగునీటి సదుపాయం కూడా కల్పించలేదు. వారి తీరే విద్య, విద్యార్థుల పట్ల ఉన్న ధోరణి ఏంటో తేటతెల్లమైంది.

మాటిచ్చారు..నిలబెట్టుకున్నారు..

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. బట్టీ చదువులకు స్వస్తి చెప్పడంతో పాటు నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా పాఠ్యాంశాల రూపకల్పన చేపట్టారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నాడు- నేడు కింద నిధులు విడుదల చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారు. ఈ క్రమంలో పెందుర్తి జూనియర్ కళాశాల పరిస్థితిని అధ్యాపకులు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి నిధుల మంజూరుకు కృషి చేశారు. దీంతో నాడు–నేడు ఫేజ్–2లో జూనియర్ కళాశాలలో వసతుల కల్పనకు రూ.1.79 కోట్ల నిధులు విడుదల చేసింది ప్రభుత్వం. ఆయా నిధులను 7 రకాల సౌకర్యాలకు కేటాయింపు చేశారు. తక్షణ నిధుల సర్దుబాటు కింద దాదాపు రూ.70 లక్షల వరకు విడుదల చేసి పనులు సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు.

సమకూరనున్న వసతులు ఇవే

- కళాశాలలోని అన్ని తరగతి గదుల్లో గ్రీన్ చాక్‌బోర్డుల ఏర్పాటు కానున్నాయి. దీనికి రూ.3,13,176 కేటాయించగా 64 బోర్డులు కళాశాలకు చేరుకున్నాయి. వారం పదిరోజుల్లో వాటిని అమరుస్తారు.
- ఫర్నీచర్ ఏర్పాటుకు రూ.37,84,342 కేటాయించారు.
- విద్యార్థి, విద్యార్థినులకు వేర్వేరుగా మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.13,02,154 కేటాయించారు. ప్రస్తుతం మరుగుదొడ్ల నిర్మాణం 95 శాతం పూర్తయింది. రన్నింగ్ వాటర్ కోసం పైప్‌లైన్ కనెక్షన్లు ఇస్తే పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయి.
- కళాశాల మొత్తానికి పూర్తి స్థాయి విద్యుత్ సదుపాయం కోసం రూ.9,12,709 కేటాయించారు. ఆయా పనులు దాదాపు 95శాతం పూర్తయ్యాయి.
- విద్యార్థులు, సిబ్బందికి సురక్షిత తాగునీటిని అందించేందుకు రూ.7,71,493 కేటాయించారు. ఆ నిధులతో రెండు ఆర్వో ప్లాంట్‌లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కళాశాలలో తాగునీరు పూర్తిస్థాయిలో అందుతోంది.
- కళాశాల మొత్తానికి రంగులు వేసేందుకు రూ.38,25,195 కేటాయించారు. త్వరలో పెయింటింగ్ పనులు ప్రారంభం కానున్నాయి.
- ఇతర చిన్నా, పెద్ద నిర్వహణ పనులకు రూ.70,37,370 కేటాయించారు. ఆయా నిధులతో కళాశాలలో అన్ని గదులకు గ్రానైట్‌తో ఫ్లోరింగ్ వేశారు. తలుపులు, కిటికీలు, గ్రిల్స్ ఏర్పాటు చేశారు. మిగిలిన పనులు సాగుతున్నాయి.


నూతనంగా ఏర్పాటు చేసిన కుళాయిలు


నేడు: నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లు

తాగునీటి సమస్య తీరింది



నేను కళాశాలలో చేరేటప్పటికి తాగునీటి సదుపాయం కూడా లేదు. నీరు లేక చాలా అవస్థలు పడేవాళ్లం. మధ్యాహ్న భోజనం సమయంలో అయితే అల్లాడిపోయేవాళ్లం. ఇటీవలే మాకు తాగునీటి సమస్య తీరింది. మిగిలిన పనులు కూడా చురుగ్గా అవుతున్నాయి.

– జి.ప్రవీణ్, ఇంటర్ సీఈసీ, ప్రథమ సంవత్సరం

చాలా రిలీఫ్‌గా ఉంది



మా కాలేజ్‌లో ఏ సౌకర్యం ఉండేది కాదు. కనీసం మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం రెండు పెద్ద మరుగుదొడ్లు నిర్మించారు. ఇప్పుడు ఆ ఇబ్బందులు తప్పుతాయి. నేల చదువులకు స్వస్తి పలికారు. బెంచీలు అమర్చారు.దీంతో చాలా రిలీఫ్‌గా ఉంది.

– వహిదా, హెచ్ఈసీ, మొదటి సంవత్సరం

మారుతున్న రూపు రేఖలు



నాడు–నేడు పథకంలో మా కళాశాల అభివృద్ధికి నిధులు కేటాయించడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలలు లాగే మా కళాశాల రూపు రేఖలు మారుతున్నాయి. మొదట్లో భవనం చూసి భయమేసేది. ఇప్పుడు తాగునీరు, మరుగుదొడ్లు, కరెంట్, కొత్త బోర్డులు వేశారు. సౌకర్యాలు కల్పించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– డి.తనుశ్రీ, బైపీసీ, ద్వితీయ సంవత్సరం

జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర ప్రగతి


పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు


సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి తదితరులు

పరవాడ: సంక్షేమంతో పాటు రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మరో సారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాలని.. అందుకు ప్రజలంతా ముందుకు రావాలని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు , జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు పిలుపునిచ్చారు. భర్నికం గ్రామంలో సర్పంచ్ పెదిశెట్టి పూజాశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, నాయకులు బొద్దపు చిన్నారావు, చల్లా కనకారావు, బొండా సతీష్, వార్డు సభ్యులు నేతల అప్పారావు, కె.వరలక్ష్మి, నాయకులు బొండా మునిస్వామి, కార్యదర్శి జానకిరామ్ పాల్గొన్నారు.

సబ్బవరం: సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి కోరారు. మండలంలోని బాటజంగాలపాలెం సచివాలయం పరిధిలో శుక్రవారం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వనం అచ్చెంనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలిచి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, నియోజకవర్గ ప్రతినిధి కొటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు,పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వనం అచ్చెంనాయుడు, సర్పంచ్ పడాల వెంకట రమణ, రామచంద్రరావు, నూక రాజు, యడ్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పరవాడ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో దేశపాత్రునిపాలెం విద్యుత్ లైన్‌లో మరమ్మతు పనుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజజినీర్ ఎస్.రామకృష్ణ చెప్పారు. ఫలితంగా గొర్లివానిపాలెం, దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెం, పోర్టుకో, బొద్దపువానిపాలెం, పి.బోనంగి, కలపాక, స్వయంభూవరం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

10న బ్రాహ్మణ కార్తీక వన సమారాధన

సింహాచలం: ఈనెల 10న సింహాచలంకి చెందిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహ బ్రాహ్మణ సంక్షేమ సంఘం కార్తీక వన సమారాధన నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు ఓరుగంటి ఫణీంద్ర శర్మ, కార్యదర్శి కొల్లూరు సుబ్బారావు శుక్రవారం తెలిపారు. సెంట్రల్ జైలు సమీపంలోని శ్రీకృష్ణాపురంలోని కాశి రాముతోటలో వన మహోత్సవంఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆరోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరమేశ్వరుడికి రుద్రాభిషేకం, ఉసిరిక వృక్ష పూజలు, కార్తీక దామోదర పూజ, వేదగోష్టి, నూతన కార్యవర్గం ఎన్నిక, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. యావత్ బ్రాహ్మణులంతా ఈ వనసమారాధనలో పాల్గొనాలని తెలిపారు. సమారాధనకు వచ్చేవారు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9603907095, 6309784932, 9912046780, 8099564782, 9618444466లలో సంప్రదించాలని కోరారు.

అవగాహనతో ఎయిడ్స్‌కు చెక్


ర్యాలీ నిర్వహిస్తున్న అడవివరం వైద్య సిబ్బంది

సింహాచలం: ఎయిడ్స్ వ్యాధిని అంతం చేసేందుకు ప్రతీ ఒక్కరు నడుం బిగించాలని అడవివరం ఆరోగ్య కేంద్రం డిప్యూటీ సివిల్ సర్జన్లు డాక్టర్ ప్రసాద్ నాయక్, డాక్టర్ వి.వి.రామారెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అడవివరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను,రోగ నిరోధక శక్తి పెంచుకునే విషయాలను వివరించారు.

సబ్బవరం: ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎన్ చక్రవర్తి అన్నారు. ఐసీటీసీ కౌన్సిలర్ రాజశేఖర్ , డాక్టర్ ఆశ, సీహెచ్‌వో స్వర్ణలత,గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయకుమార్,డాక్టర్ కన్నంనాయుడు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి సీతాలక్ష్మి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పరవాడ: ఎయిడ్స్ వ్యాధిపై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారిడాక్టర్ జయశ్రీ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ హారిక, డాక్టర్ ఏసుప్రసాద్, కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ ఎం.ఎస్.ఎస్.సాయిరాం, సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది.ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్ర అర్చకులు అందజేశారు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు

- ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు


ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఏడీసీపీ శ్రీనివాసరావు, ఏసీపీ రాజీవ్‌కుమార్

పెందుర్తి: నగరంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సమగ్ర చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాఫిక్ ఏడీసీపీ కె.శ్రీనివాసరావు చెప్పారు. పెందుర్తి సమీపంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వాసులకు శుక్రవారం ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీసీపీ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నియంత్రణకు సహకారం అందించాలని సూచించారు. ఇకపై ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. స్క్రీన్‌పై ప్రమాదాలు జరిగే విధానాన్ని వీడియోల ద్వారా చూపించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్, వెస్ట్‌జోన్ సీఐ కె.అశోక్‌కుమార్, ఎస్ఐ జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.